క్లుప్తంగా

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న మోసాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లేందుకుగానూ 'రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో' గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని సోమవారం 29వ డివిజన్‌లో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం మధురానగర్ పప్పులమిల్లు సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం లోక కల్యాణార్థం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, సేవా సమితి సభ్యులు భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. తొలుత స్వామివారికి ఆకుపూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, సేవా సమితి సభ్యులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక 26వ డివిజన్ చుట్టుగుంటలో ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి 37వ బోనాల ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బొండా మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్కరికీ ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యాన పూజలు, అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సతీష్, తోట పాండు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఎంసీలో నేడు పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని 64 డివిజన్లలో వీఎంసీ కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పనలో సమస్యలు ఉత్పన్నమైతే వాటి పరిష్కారానికి వీఎంసీ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) నిర్వహిస్తుందని కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీఎంసీ ప్రధాన కార్యాలయం, చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయం, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరం



పాయకాపురం(విజయవాడరూరల్): పైపులరోడ్డు సెంటర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎస్. మదన్‌మోహన్ మాట్లాడుతూ రక్తదానం మనిషి ప్రాణాలను కాపాడే పవిత్రమైన సేవ అని అన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జగదీశ్వరి మాట్లాడుతూ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.శ్యామల, అధ్యాపకులు పాల్గొన్నారు.

17న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేది ఆదివారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు సేవా సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిచయ వేదికలో పాల్గొనే వారు స్వయంగా వేదిక దగ్గర, లేదా 99660 96999, 96181 93027 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

'చెత్త' శుద్ధి ఏదీ..?

- డంపింగ్ కేంద్రంగా జీవీఆర్‌నగర్ రైల్వేట్రాక్ రోడ్డు
- ఇష్టారాజ్యంగా చెత్తచెదారం, సెప్టిక్ వ్యర్థాలు డంపింగ్
- వీధి కుక్కలు, పందుల స్వైర విహారం



జీవీఆర్‌నగర్ ట్రెండ్‌సెట్ రోడ్డులో వ్యర్థాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్‌లోని జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ రైల్వే ట్రాక్ ట్రెండ్‌సెట్ రోడ్డు డంపింగ్ కేంద్రంగా మారింది. ఇక్కడ విశాలంగా రోడ్డు ఉండటంతో ఎవరికి వారు చెత్తచెదారంతో పాటు కొబ్బరి బోండాలు, సెప్టిక్ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటేనే స్థానికులు హడలిపోతున్నారు. చెత్తచెదారం వల్ల వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును పట్టించుకునే వారేరీ..?

ఇక్కడ రోడ్డును పట్టించుకునే వారే కరువయ్యారు. సువిశాలంగా ఉండే ఈ మార్గంలో స్థానికులతో పాటు స్థానికేతరులు సైతం చెత్తచెదారం, వ్యర్థాలను తీసుకువచ్చి వేస్తున్నారు. ఎవరైనా ఇక్కడ చెత్త వ్యర్థాలు వేస్తున్నారేమిటని ప్రశ్నిస్తే వాగ్వాదానికి దిగుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సువిశాలంగా ఉండే ఈ మార్గంలో చెత్తచెదారం తొలగించడంతో పాటు సుందరంగా తీర్చిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా పందుల సంచారం

నగరంలో పందుల సంచారంపై నిషేధం ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం యథేచ్ఛగా తిరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇంటి వద్ద పెంచుకుంటున్న మొక్కలు, వస్తువులను సైతం పాడుచేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పందుల సంచారం వల్ల ఎప్పుడు ఏ అనారోగ్య సమస్యలు తలెత్తుతాయోనని భయాందోళన చెందుతున్నారు. వీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడ పందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే డివిజన్‌లో వీధి కుక్కలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రిపూట చీకటిలో వెంటపడి మరీ తరుముతున్నాయని ఆరోపిస్తున్నారు.



వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వస్తున్న పొగ

కలవరపెడుతున్న రైల్వే ఖాళీస్థలాలు

ఇక్కడ రైల్వే ఖాళీ స్థలాల్లో వర్షం, మురుగు నీరు నిలిచిపోయి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. వేసవిలో సైతం ఇక్కడ ఖాళీస్థలాల్లో మురుగు నీటితో నిండి ఉంటున్నాయని తద్వారా దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రైల్వే ఖాళీ స్థలాలను మెరక చేయడంతో పాటు వర్షం, మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ వ్యర్థాలకు తరచూ ఎవరో ఒకరు నిప్పు పెట్టడం వల్ల ప్లాస్టిక్ వస్తువుల నుంచి వచ్చే పొగ పీల్చడంతో శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.



రైల్వేట్రాక్ సమీపంలోని రైల్వే ఖాళీస్థలంలో నిలిచిన వర్షంనీరు

పరిసరాలు అపరిశుభ్రం



ఇక్కడ చెత్తచెదారం వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అలాగే పందుల సంచారం వల్ల ఎప్పుడు ఏ ఆరోగ్య సమస్యలు వస్తాయోనని ఆందోళనగా ఉంటోంది. ఇక్కడ వీధి దీపాలు దూరంగా ఉండటంతో రాత్రిపూట సక్రమంగా కనిపించడం లేదు. దీంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

– మురళీకృష్ణ, జీవీఆర్‌నగర్

సంతుష్ట జీవితమే ఆరోగ్యదాయకం



సభలో మాట్లాడుతున్న హజరత్తయ్య గుప్తా

పాయకాపురం(విజయవాడరూరల్): ఉద్యోగి అయినా, ఏ వృత్తి చేసే వారైనా వారి జీవితంలో సంతృప్తి అనే భావన సొంతం చేసుకొని, ఆత్మీయ అనురాగాలతో ఉంటే జీవితం సౌఖ్యవంతంగా సాగుతుందని ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మికవేత్త బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజర్తయ్య గుప్తా అన్నారు. ఆదివారం పైపులరోడ్డు ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ చేసిన గాదె అమర్‌నాథ్ ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో హజరత్తయ్య గుప్తా పాల్గొని వివిధ శ్లోకార్థ సహితంగా తెలిపి అమర్‌నాథ్ దంపతులను సత్కరించి, వేదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నాయకులు కె.గోపినాథ్‌రెడ్డి, అశోక్ రెడ్డి, వై.సుబ్బారెడ్డి, ఎస్.భాస్కరరావు, సి.హెచ్. వరప్రసాద్, ఎ. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



జీఎన్ఆర్ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎన్ఆర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల (2002-07 బ్యాచ్) అపూర్వ కలయిక ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగింది. వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తూ కూడా కుటుంబ సభ్యులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. రెండు దశాబ్దాల క్రితం ఇక్కడ చదువుకున్న రోజుల్లో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. అలాగే తెలిసీ తెలియని వయసులో తాము చేసిన అల్లరి పనులను తలచుకుంటూ వాటి వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉండవచ్చని బాధపడ్డారు. ప్రస్తుతం ఎవరు ఏ స్థాయిలో ఉన్నప్పటికీ అందరం ఒక చోట సమావేశం కావడం ఎంతో సంతోషంగా ఉందని భావిస్తూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల్లో ఒకరైన నరసింహారెడ్డి అనారోగ్యంతో ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నందున కొంత మొత్తాన్ని సేకరించి సహాయం అందజేశారు. భవిష్యత్‌లో తమ బ్యాచ్ విద్యార్థుల ఆర్థిక అవసరాలకు చేయూత ఇచ్చేందుకు కొంత మొత్తాన్ని బ్యాంకింగ్ చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇలా అప్పుడప్పుడు ఆత్మీయ కలయిక జరగాలని ఆకాంక్షించారు. కాగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పొడుగు శ్రీనివాసరావు, మేళ్లచెరువు శారద, పులిపాటి దుర్గారావులను సత్కరించారు. సమావేశంలో అనిల్, మోహన్, రాము, జక్రయ్య, అఫ్సర్, గౌరి, బిందు, అనూష, భారతి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన జీఎన్ఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీవీ రవికుమార్‌కు పూర్వ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

వెంకన్న సన్నిధిలో వైభవంగా పూర్ణాహుతి



స్వామివారికి పవిత్రాలను సమర్పిస్తున్న అర్చకులు



పూర్ణాహుతి ద్రవ్యాలను ఊరేగిస్తున్న ఆలయ అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో పూర్ణాహుతి కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పలు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున విష్వక్సేన పూజతో వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి అంతరాలయంలో నిత్య పూజలు చేశారు. అలాగే ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలతో శ్రీకృష్ణ మండపంలోకి తీసుకొచ్చారు. అనంతరం వేద పండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అనంతరం హోమ పురుషునికి వివిధ ద్రవ్యాలను హోమగుండంలో వేసి పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా పవిత్ర విసర్జన, దక్షిణాదాన మహదాశీర్వచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఈ నెల 29వ తేదీ నుంచి జరిగే సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ తూర్పు నగర నాయకుడు ఎన్.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాణిగారితోటలోని గ్రంథాలయంలో వివిధ రంగాల కార్మికులతో ఆదివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను అమ్మేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తోందన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేసేందుకు పావులు కదుపుతోందన్నారు. ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిపోయిందని, నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, విద్యుత్ చార్జీలు, విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. కానీ ఉద్యోగులు, కార్మికుల వేతనాలు మాత్రం పెరగకపోవడంతో కొనుగోలు శక్తి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాడే సీఐటీయూకు కార్మికులు మద్దతు తెలిపి పెద్ద ఎత్తున మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్, డి.వరప్రసాద్, కృష్ణ, కోటిరెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ రేసింగ్ చేస్తే కఠిన చర్యలు

ఇబ్రహీంపట్నం: నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై బైక్ రేసింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు యువకులను హెచ్చరించారు. స్థానిక రింగ్ సెంటర్‌లో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో స్పోర్ట్స్ బైక్‌పై రేసింగ్ చేస్తూ 65వ నంబర్ జాతీయ రహదారిపై వస్తున్న యువకులు పోలీసుల కంట పడ్డారు. ట్రాఫిక్ పోలీసులను చూసిన యువకులు పక్కనే ఉన్న పవిత్ర సంగమం రోడ్డులోకి రేసింగ్ స్టైల్లోనే వెళ్లిపోయారు. ట్రాఫిక్ సిబ్బంది వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఖరీదైన బైకులతో సోషల్ మీడియా లైక్‌ల కోసం ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ట్రాఫిక్ ఎస్ఐ హెచ్చరించారు. వాహన రికార్డులు, ఇన్సూరెన్స్, లైసెన్స్‌లేని వ్యక్తులకు జరిమానా విధించారు. సిబ్బంది పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్‌లో వేంచేసి ఉన్న గంగానమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారంతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. గంగానమ్మ అమ్మవారి గుడి నిర్వాహకులు మాచర్ల ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో గుడి నిర్వాహకులు మాచర్ల గంగా, క్లైపల్లి శ్రీనివాసరావు, వల్లభాపురం అనిల్, కొటారి యేసుబాబు, ఎం.గోపినాథ్, వక్కలగడ్డ ప్రసాద్, వి.రమా, మాచర్ల కస్తూరి, పెనుమూడి శేష కుమారి, భక్తులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా సాగిన నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న యామిని ప్రియాంక

విజయవాడ కల్చరల్: ప్రముఖ నాట్యాచార్యుడు డాక్టర్ చింతారవి బాలకృష్ణ నృత్య పర్యవేక్షణలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో వుల్లూరి యామిని ప్రియాంక కూచిపూడి రంగప్రవేశం సందర్భంగా ఆదివారం నిర్వహించిన అంశాలు నేత్ర పర్వంగా సాగాయి. విఘ్నరాజం భజేతో ప్రారంభించి, శరణం భవ కరుణామయ, త్యాగరాజస్వామి కీర్తన, జావళి హనుమ ధిల్లానా అంశాలను ప్రదర్శించింది. నట్టువాంగం అంశాన్ని డాక్టర్ చింతారవి బాలకృష్ణ, గాత్రం సీహెచ్ శాంతి, వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయులు, వేణువుపై వనమాలి సహకరించారు. ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలని సూచించారు. గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని కోరారు. మిస్ ఇండియా 2025 విజేత కవ్వం విజయలక్ష్మి యువ నృత్య కళాకారిణిని అభినందించారు. అనంతరం నాట్యాచార్యుడు ఏలేశ్వరపు వెంకటేశ్వర్లను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వుల్లూరి గంగాధర్, శ్రీలలిత, పండు శ్రీనివాసరావు, విష్ణులత, పోతురాజు, రామ్మోనరావు, జీవన జ్యోతి పాల్గొన్నారు.

పోటాపోటీగా నర్తించిన చిన్నారులు



నృత్య పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ, చంద్రశేఖర్

- హరిత బెరంపార్క్‌లో నృత్య పోటీలు
- ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకే పోటీలు: కలెక్టర్ లక్ష్మీశ

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా యంత్రాంగం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో నిర్వహిస్తున్న సంప్రదాయ నృత్య పోటీల్లో భాగంగా ఆదివారం రెండవ కేటగిరికి చెందిన 7-10 ఏళ్ల వయసుగల చిన్నారులు పోటాపోటీగా నర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ కళలకు కాణాచిగా ప్రసిద్ధి చెందిన ఉమ్మడి కృష్ణా జిల్లాలో కళా సంపదను మరింత పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భావి తరాలకు కళా సంపదను వారసత్వంగా అందించేందుకు విజయవాడ టాలెంట్ పోటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. తద్వారా వారిలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నామని తెలిపారు. కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్య తీసుకువచ్చేందుకు అవకాశం ఉందన్నారు. సుసంపన్న ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ సాకారానికి పర్యావరణ పరిరక్షణ కీలకమని, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి చెక్ పెట్టి స్వచ్ఛతా మార్గంలో పయనించేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రోల్ మోడల్‌గా నిలిపేందుకు జిల్లా అధికార యంత్రాంగం, నగర పాలక సంస్థ, వివిధ భాగస్వామ్య పక్షాల సహాయంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే ఆదివారం 11-15 ఏళ్ల వయసు కేటగిరిలో నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులు

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న యోగా సాధకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): యోగా సాధనతో సంపూర్ణ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు యోగ సాధకులు తెలిపారు. శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం (మంగళగిరి) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ భవానీపురం -1 శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకటవ శాఖ అధ్యక్షుడు గుండు జనార్ధనరావు, యోగాచార్యులు కళాధర్ యోగి నేతృత్వంలో విద్యాధరపురంలోని సరస్వతి నిలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. నిత్య జీవితంలో యోగా చేయడం వల్ల కలిగే ఫలితాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సంస్థ వ్యవస్థాపకుడు శ్రీవెంకటేశ్వర యోగి గురూజీకి జేజేలు పలికారు. దైనందిన జీవితంలో యోగ సాధనకు కొంత సమయాన్ని కేటాయించాలని, తద్వారా దీర్ఘకాలిక వ్యాధులు దూరం అవుతాయని తెలిపారు. దాదాపు వంద మందికిపైగా యోగా సాధకులు పాల్గొన్న ఈ పాదయాత్ర పలు వీధులగుండా సాగుతూ తిరిగి సరస్వతి నిలయం వద్దకు చేరుకుంది. అనంతరం అక్కడ నిత్య యోగా సాధకుల ఉపన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పరుచూరు లక్ష్మీప్రసాద్, వక్కలగడ్డ శ్రీధర్, శిరంశెట్టి వెంకటేశ్వరరావు, జనపాల శ్రీనివాసరావు, గంజి రంగనాయకులు రెడ్డి, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

యువతలో అధికమవుతున్న వినికిడి సమస్యలు



వృద్ధుడికి వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: యువత అధికంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, ఇయర్ ఫోన్స్ వినియోగించడం వల్ల చిన్న వయస్సులో వినికిడి లోపాన్ని ఎదుర్కొంటున్నారని ప్రముఖ కాక్లియర్ ఇంప్లాంట్ వైద్య నిపుణులు యార్లగడ్డ సుబ్బారాయుడు, ఈఎన్‌టీ వైద్య నిపుణులు రాయల్ ప్రీతమ్ పేర్కొన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులో సీతారామస్వామి దేవస్థానం ట్రస్ట్, ప్రవాసాంధ్రులు కోవి శ్లోక నేతృత్వంలో వినికిడి, చెవి సంబంధిత సమస్యలపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వయోభారంతో వృద్ధుల్లో కలిగే వినికిడి లోపంతో పాటుగా ఇటీవలి కాలంలో యువతలోనూ ఈ సమస్య అధికమవుతుందని డాక్టర్లు చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది యువత తప్పు వినికిడి అలవాట్ల వల్ల శాశ్వత శ్రవణ నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే చెవి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తే వృద్ధాప్యంలోనూ వినికిడి లోపం రాదని చెప్పారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటుగా అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆడియాలజిస్ట్ శ్రీను నాయక్, రాధిక రాయుడు, ఆస్పత్రి సిబ్బంది, గ్రామ ప్రముఖులు ముసునూరు కాశీవిశ్వేశ్వరరావు, కోవి శశిధర్ పాల్గొన్నారు.